## నీటి నాణ్యత పరిశీలన

నార్నూర్, మే 28 : గాదిగూడ మండలం లోకారి(బీ) గ్రామంలో తాగునీటి నాణ్యతను పరిశీలించామని పంచాయతీ కార్యదర్శి దుర్గం రాహుల్ తెలిపారు. ఇటీవల చాలా మందికి వాంతులు, విరేచనాలు అయిన నేపథ్యంలో తాగునీటిని పరిశీలించడంతో ఎలాంటి నాణ్యత లోపం లేదన్నారు. ఈ నీరు నిర్భయంగా తాగవచ్చని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర

తాంసి, మే 28 : కప్పర్ల గ్రామంలో హనుమాన్ దీక్షాపరులు మంగళవారంప్రధాన వీధుల గుండా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కౌడాల మహేందర్, గంద్రత్ అశోక్, గురుస్వాములు గంగయ్య, మహేందర్, తిరుపతి, భక్తులు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తిని రక్షించిన డీఎల్పీవో

తాంసి(భీంపూర్), మే 28: భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామ పంచాయతీ పరిశీలన చేసి తన వాహనంలో డీఎల్పీవో ఫణిందర్ ఆదిలాబాద్ వైపు వెళ్తున్న క్రమంలో వడూర్ దాటిన తర్వాత ఎండలో ఓ యువకుడు మోటర్ సైకిల్ పడేసుకొని గాయపడి ఉన్నాడు. ఇది చూసి వాహనం ఆపి క్షతగాత్రుడికి నీళ్లు ఇచ్చి తన వాహనంలో ఆదిలాబాద్ దవాఖానకు తరలించి ప్రాణాలను రక్షించారు. ఆ యువకుడు మహారాష్ట్ర వగ్యారా గ్రామానికి చెందిన నయాన్ అని, అర్లి(టీ)లో మేనమామను కలిసి వెళ్లే క్రమంలో ఇలా జరిగిందని తెలిసింది. ఆదిలాబాద్ డీఎల్పీవోను మహారాష్ట్ర వగ్యారా వాసులు, భీంపూర్ మండల వాసులు అభినందించారు.

## మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్‌కు పరామర్శ

ఖానాపూర్, మే 28: ఖానాపూర్ మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ బండారి కిశోర్ దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మంగళవారం మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు పరిమి సురేశ్, సతీశ్, రాజేశ్ ఉన్నారు.

## అంగడీబజార్‌లో అమ్మకాలు కొనసాగించాలి

ఖానాపూర్, మే 28: కూరగాయల వ్యాపారులు అంగడీబజార్‌లో ఏర్పాటు చేసిన ఖాళీ స్థలంలో తమ అమ్మకాలు కొనసాగించాలని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం కోరారు. మంగళవారం పట్టణంలోని అంగడీబజార్ ఖాళీ స్థలంలో అమ్మకాల కోసం ఏర్పాటు చేసి స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో వ్యాపారస్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వాటిలోనే విక్రయాలు కొనసాగించాలని చైర్మన్ సూచించారు. మున్సిపల్ సిబ్బందికి వ్యాపారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

## ఎన్టీఆర్ జయంతి వేడుకలు

నిర్మల్ అర్బన్, మే 28: నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలోని మంగళవారం ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రీనివాస్, కిషన్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

నిర్మల్ అర్బన్, మే 28 : నిర్మల్‌లోని 14వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ మతిన్ తండ్రి మంగళవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

## రుతుస్రావం, పరిశుభ్రత దినం కార్యక్రమాలు

నిర్మల్ చైన్‌గేట్, మే 28: నిర్మల్ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పల్లె దవాఖానల్లో మంగళవారం రుతస్రావం, పరిశుభ్రత దినం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. రుతస్రావ సమయంలో ఏర్పడే సమస్యలు, ఇబ్బందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, మహిళలు, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఆరోగ్య సహాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులు అడిగిన విత్తనాలు ఇవ్వాలి

- పలు విత్తన దుకాణాలు తనిఖీ చేసిన అధికారులు

నేరడిగొండ, మే 28 : రైతులు అడిగిన విత్తనాలు మాత్రమే ఇవ్వాలని మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు వ్యాపారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పలు విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అవసరమైనవి కాకుండా వ్యాపారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోందని అలా చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. రైతులకు అన్ని రకాల విత్తనాలు దుకాణాల్లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి భాస్కర్, ఆర్ఐ నాగోరావ్, పోలీస్ అధికారి పాల్గొన్నారు.



నేరడిగొండ : దుకాణాల్లో విత్తన ప్యాకెట్లు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు



ఉట్నూర్: విత్తనాలు పరిశీలిస్తున్న అధికారులు

ఉట్నూర్, మే 28 : మండల కేంద్రంలోని పలు విత్తన విక్రయ దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు వినయ్, దేవేందర్, మహేశ్, రంజిత్ తనిఖీ చేశారు. రైతులకు విక్రయించే విత్తనాలకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. విక్రయదారుల రికార్డులు, రైతులకు అందించిన వివరాలు, బోర్డులో రేట్లు రాయాలని పలు సూచనలు చేశారు. వారి వెంట పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

### అందుబాటులో విత్తనాలు

ఇచ్చోడ, మే 28 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని ఫర్టిలైజర్ షాపుల్లో రైతులకు కావాల్సి పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ అన్నారు. ఇచ్చోడ మండలంలోని లక్షా 27 వేల ప్యాకెట్ల విత్తనాలు వచ్చాయని తెలిపారు. 40,820 విత్తన ప్యాకెట్లు విక్రయించగా 80,481 ప్యాకెట్లు నిల్వ ఉన్నట్లు తెలిపారు. రైతులకు ఈ నెల వరకు మరికొన్ని విత్తన ప్యాకెట్లు వస్తాయని పేర్కొన్నారు. సిరికొండ మండలంలో కావాల్సి విత్తనాలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా ఏఈవోలు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని నియమించామని తెలిపారు. రైతులకు ఇబ్బంది కలగకుండా దుకాణ యజమానులు చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు సాయిరాం, మనీషా, అనుదీప్ పాల్గొన్నారు.

## జీలుగ విత్తనాలు పంపిణీ



సారంగాపూర్: ఆలూర్ సొసైటీలో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో రాజశేఖర్‌రెడ్డి

సారంగాపూర్, మే 28: ఆలూర్ గ్రామంలోని సహకార సంఘంలో ఏవో రాజశేఖర్‌రెడ్డి మంగళవారం రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీ 60 శాతం పోను 30కేజీల జీలుగ విత్తనాల బస్తాకు రూ.1116 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆలూర్ సొసైటీ సిబ్బంది మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

కడెం, మే 28: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఏడీఏ సుజాత రైతులకు రాయితీ జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో సంధ్యారాణి, ఏఈవో సురేశ్, పీఏసీఎస్ సీఈవో రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

### నేటి నుంచి...

ఖానాపూర్, మే 28: ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు నేటి నుంచి సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందజేస్తామని సీఈవో భూమి ఆశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానగర్‌లోని ప్రాథమిక సహకార సంఘం గోదాంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలు విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకువచ్చి జీలుగ విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు. 30 కిలోల జీలుగ విత్తనాల బ్యాగు రూ. 1116 ఉంటుందని తెలిపారు.

# నకిలీ విత్తనాల అమ్మకాలు అరికట్టాలి



మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

పెంబి, మే 28: నకిలీ విత్తనాల అమ్మకంపై ఉక్కుపాదం మోపాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూక్యా కవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోడు భూములో సాగును అడ్డుకోవద్దని అటవీ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రామ్‌నగర్ గ్రామంలో త్రీఫేజ్ విద్యుత్ అందించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి ఎంపీటీసీ రామారావు తీసుకువచ్చారు. అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతోనే రామ్‌నగర్ గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ అందించడం లేదని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీవో, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అన్నదాతల ఆవేదనకు మంత్రి బాధ్యత వహించాలి

ఎదులాపురం, మే 28 : ప్రస్తుత వానకాలంలో విత్తనాల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ మంత్రి దూరదృష్టి లేకపోవడమే నేటి పరిస్థితులకు కారణమని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో గతంలో లేని విధంగా నకిలీ విత్తనాల తయారీ ముఠాలు ఏర్పడడం అనేది కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమన్నారు. విత్తనాల కొనుగోలు విషయంలో ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచే రైతులు, మహిళలు కూడ వంద మీటర్ల దూరం లైన్ కట్టడం అనేది బాధాకరం, నేడు జిల్లా కేంద్రంలో అన్నదాతలపై జరిగిన ఘటనను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. రైతులకు అవసరమైన 659 పత్తి విత్తనాలు జిల్లాకు సరిపడే విధంగా తెప్పించడంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఘోరంగా విఫలమయ్యారు.

## వ్యవసాయ బావిలో పడి మతిస్థిమితం లేని యువకుడు మృతి



బట్టు రాజు (ఫైల్)

నిర్మల్ అర్బన్/లక్ష్మణచాంద, మే 28: సోన్ మండలం బొప్పారం గ్రామంలోని వ్యవసాయ బావిలో పడి మతిస్థిమితం లేని యువకుడు మృతి చెందాడు. లక్ష్మణచాంద మండలం ధర్మారం గ్రామానికి చెందిన బట్టు రాజు(25) సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బొప్పారం గ్రామ సమీపంలో గల వ్యవసాయ బావిలో నీళ్లు తాగేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

## ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

తానూర్, మే 28 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన తానూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ లోకం సందీప్ వివరాల ప్రకారం..ఖర్బలా గ్రామానికి చెందిన తడిపేలు సాయినాథ్ (35) వ్యవసాయ భూమిలో ట్రాక్టర్ రూటర్ సహాయంతో భూమిని చదును చేస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి డ్రైవర్‌పై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సిరాల శివారులో చిరుతపులి సంచారం

భైంసాటౌన్, మే 28 : భైంసా మండలం సిరాల గ్రామ శివారులో చిరుత పులి సంచరించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం గ్రామానికి చెందిన డేరే మాధవ్ అనే వ్యక్తి మహాదేవుని గుట్ట సమీపంలో గుహ వద్ద పులిని చూడడంతో భయంతో ఊరిలోకి వచ్చి గ్రామస్తులకు తెలియజేశాడు. రెండు సంవత్సరాల క్రితం ఇదే ప్రాంతంలో పులి సంచరించింది. దీంతో పొలాలకు పని కోసం వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు.

## వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ దివాకర్

దస్తురాబాద్, మే 28: మండలం కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. హెడ్ కానిస్టేబుల్ దివాకర్ సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## పరామర్శ



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మే 28 : బొందిడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆడె కైలాస్ కుమారుడు అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొంది ఇంటికి రావడంతో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో ఆరోగ్య విషయం గురించి అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు జాదవ్ వసంత్, సురేందర్, శ్రీకాంత్, భూషణ్, గ్రామ పెద్దలు ఉన్నారు.

## వైభవంగా నాగవెల్లి

దిలావర్‌పూర్, మే 28 : మండలంలోని ప్రసిద్ధ దేవాలయమైన శ్రీ కాల్వ లక్ష్మీనర్సింహస్వామి వారి నాగవెల్లి కార్యక్రమం మంగళవారం యజ్ఞచార్యులు చక్రపాణి నర్సింహమూర్తి, శ్రీమాన్ వాసుదేవాచార్యులు, ఆలయ పండితుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. స్వామి వారి నాగవెల్లి కార్యక్రమాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పండితులు రాము, వెంకటేశ్, శ్రీనివాస్, చైర్మన్ పూజారం మహేశ్, ఆలయ ధర్మకర్తలు, ఈవో రవికిషన్‌గౌడ్, ఆలయ క్లర్క్ మాధవరావు, ఆలయ మాజీ చైర్మన్లు ఇప్ప నర్సారెడ్డి, చిన్నయ్య, భక్తులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా కొనసాగుతున్న పరీక్షలు

ఎదులాపురం, మే 28 : ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం నిర్వహించిన ప్రథమ సంవత్సర పరీక్షకు 2207 మందికి 1694 మంది విద్యార్థులు హాజరై 513 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 845 మందికి 808 మంది విద్యార్థులు హాజరై 37 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్ కుమార్ తెలిపారు.

## సీసీ కెమెరా ఇన్‌స్టాల్‌పై ఉచిత శిక్షణ

ఉట్నూర్, మే 28: సీసీటీవీ కెమెరా ఇన్‌స్టాల్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 18 నుంచి 45 సంవత్సరాల లోపు యువత పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన వారు తమ రేషన్‌కార్డు, సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా, పాన్‌కార్డు, పాస్‌ఫోర్టు సైజు ఫొటోలతో స్థానిక ఆర్‌సెటీ కార్యాలయంలో జూన్ 11వ తేదీన ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, బస్‌చార్జీలు సైతం ఇవ్వనున్నట్లు తెలిపారు.

## యువకులకు శిక్షణ, ఉపాధి

భైంసా, మే 28 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిరుద్యోగ యువకులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఎలక్ట్రీషియన్, ప్లంబర్‌లో మూడు నెలలు శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి జిల్లా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామని పేర్కొన్నారు. రూ. 18 వేల నుంచి 20 వేల వరకు వేతనం ఉంటుందని, ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఈ శిక్షణకు పదో తరగతి పాస్ లేదా ఫెయిల్, అడ్మిషన్‌కు జూన్ 2 చివరి తేదీ, ఇతర వివరాలకు 9866565156 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## 31లోపు జొన్నలు విక్రయించాలి

బోథ్, మే 28 : బోథ్ మార్కెట్ యార్డు పరిధిలోని రైతులు ఈ నెల 31వ తేదీలోపు తమ జొన్నలు మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి విక్రయించుకోవాలని కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ నుంచి కొనుగోలు నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి ఈ నెల 31లోపు మార్కెట్‌కు జొన్నలు తీసుకొచ్చి విక్రయించుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# ఏకరూప దుస్తులు గడువులోగా కుట్టించాలి



ఏకరూప దుస్తుల వస్త్రం అందజేస్తున్న ఫైనాన్స్ డీపీఎం నరేందర్

జైనథ్, మే 28: మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుట్టిస్తున్న ఏకరూప దుస్తులు గడువులోగా పూర్తి చేయాలని ఫైనాన్స్ డీపీఎం బీ నరేందర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో టైలర్స్‌కు ఏకరూప దుస్తుల వస్త్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 64 పాఠశాలలో 5286 మంది విద్యార్థులకు గాను 11,538 మీటర్ల వస్త్రాన్ని అందజేశామని తెలిపారు. జూన్ 10వ తేదీలోగా అన్ని పాఠశాలలకు చెందిన ఏకరూప దుస్తులు కుట్టించి ఇవ్వాలని సూచించారు. రోజు వారీగా ఎన్ని దుస్తులు కుడుతున్నారో ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏపీఎం భగవాండ్లు, సీబీవో ఆడిటర్ ఎన్ శ్రీనివాస్, ఎంఆర్‌సీ సిబ్బంది సుభాష్, సీసీలు నాందేవ్, ఎల్టీ వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగారాం, జీ శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మి, ఎంఎస్ అధ్యక్షురాలు సుజాత, రూప, వీవోఏలు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు

నిర్మల్ అర్బన్, మే 28 : మహారాష్ట్రలోని పూణేలో నిర్వహించిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో నిర్మల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చినట్లు కిక్ బాక్సింగ్ జిల్లా అధ్యక్షుడు చందుల స్వామి తెలిపారు. నాగలక్ష్మి, దివ్య వెండి పతకాలు సాధించగా, నక్షత్ర, సుజల ఐదో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన వీరిని జిల్లా క్రీడల శాఖ అధికారి నఫేఖాన్, స్కూల్ గేమ్ సెక్రటరీ రామారావు అభినందించారు.

# 49,087 క్వింటాళ్ల జొన్నల కొనుగోళ్లు



జొన్నలు తూకం వేస్తున్న హమాలీలు

బోథ్, మే 28 : బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘం ద్వారా మంగళవారం వరకు 49,087 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన 2219 మంది రైతుల నుంచి 98,174 బస్తాల జొన్నలు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3180 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రగతిపై శ్రద్ధ తీసుకోవాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్పీవో ఫణిందర్

తాంసి(భీంపూర్), మే 28: గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం, స్థానిక సమస్యల పరిష్కారంపై కార్యదర్శులు మరింత శ్రద్ధ తీసుకోవాలని డీఎల్పీవో ఫణిందర్ సూచించారు. భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఇంటి పన్నుల వసూలు, నంబర్లు మిస్ అయిన ఇండ్లకు నంబర్ వేయాలన్నారు. డీఎల్పీవో వెంట కార్యదర్శులు సాయి, ప్రసాద్, నితిన్, నర్సయ్య, రవికాంత్ ఉన్నారు.

# విత్తనాలు అందుబాటులో ఉంచాలి

బోథ్, మే 28 : వానకాలం పంటల సాగు కోసం రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో పత్తి విత్తనాల పంపిణీ సమయంలో రైతులపై లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నడు కూడా రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఆందోళనలు చేపట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు మళ్లీ పాత రోజులు మాదిరి పరిస్థితి నెలకొందన్నారు. రైతులకు కావాల్సిన పత్తి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బోథ్ మార్కెట్ యార్డులో చేపడుతున్న జొన్నల కొనుగోళ్లలో మహారాష్ట్ర నుంచి వస్తున్న జొన్నలు కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక్కడి రైతుల జొన్నలనే కొనుగోలు చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందళోన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

# తేనెటీగల పెంపకంతో లాభాలు

ఉట్నూర్, మే 28: రైతులు తేనెటీగల పెంపకంతో అధిక లాభాలు గడించవచ్చని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. మంగళవారం స్థానిక అధికారులతో మాట్లాడుతూ గిరిజన రైతులకు అధిక లాభాలు పొందేలా తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఆసక్తిగల యువ రైతులను గుర్తించి వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల రైతులు 9848687871 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



తేనె పట్టును చూపిస్తున్న అధికారులు

# వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ కిషన్

ఇచ్చోడ, మే 28: పాడి పశువులకు వర్షాకాలం ప్రారంభంలో సరైన టీకాలు వేయించి వాధి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ కిషన్ అన్నారు. మండల కేంద్రంలోని పలు డెయిరీ ఫాంలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల దిగుబడి కూడా తగ్గకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా వేసవిలో పాడి పశువులకు నీరు ఎక్కువగా అందిస్తూ ఆకు పచ్చని పశు గ్రాసాన్ని అందించడం వల్ల పాల దిగుబడి తగ్గకుండా కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో డెయిరీ రైతులు అభిషేక్, శివ, పశు వైద్య సిబ్బంది శేఖర్, రమేశ్ పాల్గొన్నారు.